క్లుప్తంగా

వైభవంగా లక్ష్మీనృసింహుని కల్యాణం



అంతర్వేదిలో నిర్వహిస్తున్న స్వామి కల్యాణం

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనృసింహుని ఆలయంలో శనివారం ఆర్జిత సేవగా స్వామివారి శాంతి కల్యాణం బహుళ ద్వాదశి తిథి నాడు అర్చకులు ఘనంగా నిర్వహించారు. తొలుత ఆలయంలోని కల్యాణ మండపంలో ప్రత్యేక వేదికపై ఉత్సవమూర్తులను కొలువుదీర్చారు. అనంతరం స్వామివారి శాంతి కల్యాణం విష్వక్సేన పూజతో అర్చకులు ప్రారంభించారు. వేద మంత్రాలతోను, మంగళవాయిద్యాల నడుమ కనులపండువగా ప్రధాన అర్చకుడు పాణింగిపల్లి శ్రీనివాస కిరణ్ ఆధ్వర్యాన స్థానాచార్య వింజమూరి రామరంగాచార్యులు, అర్చకులు, వేద పండితులు ఈ కల్యాణం నిర్వహించారు. కల్యాణంలో పాల్గొన్న భక్తులకు దేవస్థానం స్వామి మూలవిరాట్ దర్శనం, అలాగే లడ్డూ ప్రసాదం ఇచ్చి, అన్నదాన పథకంలో భోజన సౌకర్యం కల్పించింది. ఆలయ అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ, పలువురు భక్తులు పాల్గొన్నారు.

ప్రతిపక్షాలకు ప్రజలే బుద్ధి చెబుతారు



గుడిమెళ్లంక సమావేశంలో మాట్లాడుతున్న గొల్లపల్లి సూర్యారావు

మలికిపురం: వచ్చే ఎన్నికల్లో ప్రతి పక్షాలకు ప్రజలే తగిన బుద్ధి చెబుతారని రాజోలు వైఎస్సార్ సీపీ అభ్యర్థి గొల్లపల్లి సూర్యారావు పేర్కొన్నారు. మండలంలోని గుడిమెళ్లంకలో మాజీ సర్పంచ్ కలగత యేసురత్నం ఆధ్వర్యంలో వైఎస్సార్ సీపీ కార్యకర్తల సమావేశం శనివారం జరిగింది. కార్యక్రమంలో పాల్గొన్న సూర్యారావు మాట్లాడుతూ దేశంలోనే ఏ రాష్ట్రంలోనూ జరగని విధంగా మన రాష్ట్రంలో సీఎం జగన్‌మోహన్ రెడ్డి అభివృద్ధి చేసి చూపించి చేతల ముఖ్యమంత్రిగా పేరొందారని అన్నారు. కానీ ప్రతిపక్షాలు బురద జల్లే విధంగా ప్రవర్తించడాన్ని ప్రజలకు గమనిస్తున్నారని అన్నారు. ఓటుతో బుద్ధి చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. సమావేశంలో నాయకులు పెన్మత్స రంగరాజు, గ్రామశాఖ అధ్యక్షులు కఠారి సుబ్బరాజు, కలగతి మధుబాబు, సెక్రెటరీ ఉల్లంపర్తి భాస్కరరావు, బండారు కాశి, కలగతా శ్రీధర్, కనూరి రజింత్ కుమార్, రాపాక దీవెనకుమారి పాల్గొన్నారు.

వేంకటేశ్వరుని ఆలయానికి పోటెత్తిన భక్తులు

అయినవిల్లి: మండలంలోని నల్లచెరువులో వేంచేసిన అలిమేలు మంగ, పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామి దర్శనం కోసం శనివారం భక్తులు పోటెత్తారు. స్వామికి ఆలయ వేదపండితుల ఆధ్వర్యంలో తెల్లవారుజామున తోమాల సేవ, అర్చన, నైవేద్యం, నక్షత్ర హారతి, కుంభ హారతి వంటి విశేష పూజలు చేశారు. వేద పండితుల స్వామికి తులసిపూజలు చేశారు. స్వామిని వివిధ పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. భారీ అన్నదానం ఏర్పాటు చేశారు. స్వామివారికి పటిక బెల్లం మొక్కుబడి చెల్లించారు.

కొర్లపాటివారిపాలెంలో..

అంబాజీపేట: స్థానిక కొర్లపాటివారిపాలెంలో వేంచేసిన వేంకటేశ్వర స్వామి వారి ఆలయం శనివారం భక్తులతో పోటెత్తింది. ఏడుకొండల స్వామి ఐదు వారాలు దర్శించుకుంటే కోరిన కోర్కెలు తీరుతాయని భక్తుల ప్రగాఢ విశ్వాసంతో భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. తొలుత స్వామి వారికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు చేశారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

కార్యకర్తలు, బూత్ కన్వీనర్లతో సమావేశం

సఖినేటిపల్లి: మండలంలోని కేశవదాసుపాలెంలో శనివారం వైఎస్సార్ సీపీ కార్యకర్తలు, బూత్ కన్వీనర్లతో సమావేశం నిర్వహించారు. రానున్న ఎన్నికల్లో బూత్‌లలో ఓటింగ్ శాతం పెంచేందుకు అనుసరించాల్సిన విధానాలపై జేసీఎస్ మండల ఇన్‌చార్జ్ నల్లి మోహన్, పార్టీ మండల అధ్యక్షుడు కుసుమ చంద్రశేఖర్, గ్రామ శాఖ అధ్యక్షుడు వై.చిట్టిబాబు వివరించారు. ఎమ్మెల్యే అభ్యర్థి సూర్యారావు తనయుడు శ్రీధర్, ఎంపీపీ వీరా మల్లిబాబు, కొల్లాబత్తుల చిట్టిబాబు, తాడి సహదేవ్ పాల్గొన్నారు.

జొన్నాడలో..

ఆలమూరు: దేశ సమైక్యత కోసం, ప్రజాహితం కోసం అనునిత్యం దేశంలో పోరాడే ఏకైక రాజకీయ పార్టీ బీజేపీయేనని కొత్తపేట నియోజకవర్గ కన్వీనర్ అయినవిల్లి సత్తిబాబు గౌడ్ వ్యాఖ్యానించారు. మండలంలోని జొన్నాడలో శనివారం బీజేపీ ఆవిర్భావ దినోత్సవం జరిగింది. బీజేపీ మండల శాఖ అధ్యక్షుడు నాగిరెడ్డి స్వామి నేతృత్వంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి నియోజకవర్గ కన్వీనర్ సత్తిబాబు గౌడ్ పాల్గొని ప్రసంగించారు. 1984లో పార్లమెంట్ ఎన్నికల్లో ఇద్దరు సభ్యుల ప్రస్థానంతో ప్రారంభమైన బీజేపీ ఇప్పుడు ప్రపంచంలోనే అతిపెద్ద పార్టీగా అవతరించిందన్నారు. బీజేపీ అప్రతిహత విజయాల వెనుక దివంగత ప్రధాని అటల్ బిహారి వాజ్‌పేయి, మాజీ ఉప ప్రధాని అద్వానీ కృషి మరువలేనిదన్నారు. వచ్చే నెలలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీ విజయం సాధించి తిరిగి దేశ ప్రధాని మోదీ నాయకత్వంలో కేంద్రంలో అధికారంలోకి రావడం ఖాయమని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

వాహ్..ఆర్ఎస్

- ఎండ తీవ్రత నుంచి ఉపశమనం
- ఓఆర్ఎస్‌ను అందుబాటులో ఉంచుకోవడం తప్పనిసరి
- అన్ని ప్రభుత్వాస్పత్రుల్లో ఉచితంగా లభ్యం
- మోతాదుకు మించి సేవించరాదు
- వైద్య, ఆరోగ్య సిబ్బంది విస్తృత ప్రచారం



పెదపళ్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అందుబాటులో ఉంచిన ఓఆర్ఎస్ ద్రావణం



చెముదులంకలో ఓఆర్ఎస్ ద్రావణాన్ని పంపిణీ చేస్తున్న వైద్య, ఆరోగ్య సిబ్బంది

ఆలమూరు: ఏప్రిల్ తొలివారంలోనే భానుడి భగభగలు తీవ్రమయ్యాయి. తెల్లవారుజాము మంచు కురుస్తుండగా.. మధ్యాహ్నానికి ఎండలు తీవ్రరూపం దాల్చుతున్నాయి. ఉక్కపోత గణనీయంగా పెరిగి.. వడగాల్పులూ వీస్తుండడంతో జనం తీవ్ర అనారోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారు. దైనందిన జీవితంలో అనేక మంది ఎండల్లో ఎక్కువగా తిరగాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. ఎండ తీవ్రతకు శరీరంలో నీటి శాతం క్షీణించి.. ఫలితంగా వడదెబ్బకు గురయ్యే అవకాశం ఉంది. అలాంటి సమయాల్లో ఓఆర్ఎస్ (ఓరల్ రీహైడ్రేషన్ సాల్ట్) ద్రావణం ఉపకరిస్తుందని వైద్యారోగ్య అధికారులు చెబుతున్నారు.

ఇప్పటికే ఓఆర్ఎస్ ద్రావణం ప్రయోజనాలను వైద్యారోగ్య సిబ్బంది క్షేత్ర స్థాయిలో ఇంటింటికీ వెళ్లి వివరిస్తున్నారు. గ్రామాల్లోని ముఖ్య కూడళ్లలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు.

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని రాజోలు, కొత్తపేట, పి.గన్నవరం నియోజకవర్గాల్లో 25 గ్రామీణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, నాలుగు సామాజిక ఆరోగ్య పోషక కేంద్రాలు ఉన్నాయి. వీటితో పాటు 439 హెల్త్ క్లినిక్‌లలో ఓఆర్ఎస్ ద్రావణాన్ని, జింక్ మాత్రలను ప్రత్యేకంగా ప్రజలకు అందుబాటులో ఉంచారు. వేసవి దృష్ట్యా ఓఆర్ఎస్ కొరత లేకుండా వేలాది ప్యాకెట్లను అందుబాటులో పెట్టారు.

ఓఆర్ఎస్ ప్రాధాన్యమిలా..

వాతావరణ పరిస్థితులకనుగుణంగా ప్రతిఒక్కరూ శరీరాన్ని నిర్దిష్ట ఉష్ణోగ్రతలో ఉండేలా వైద్యుల సూచనల మేరకు చర్యలు తీసుకోవాలి. మెదడులో హైపో తలామస్ అనే భాగం శరీరంలోని వేడిని క్రమబద్ధీకరిస్తుంది. తగిన నీటిని తీసుకోకపోయినా లేదా ఎండలో ఎక్కువగా తిరిగినా హైపో తలామస్‌పై తీవ్ర ప్రభావం చూపుతుంది. ఫలితంగా హైపో తలామస్ అధిక ఉష్ణోగ్రతకు లోనై క్రమబద్ధీకరించే స్థితిని కోల్పోతుంది. ఆ స్థితిలో తల తిరగడం, నీరసం, నిస్సారణ, తలనొప్పి, జ్వరం, చీకటి కమ్మినట్టు అనిపించడం, వాంతి అవుతున్న భావన కలగడం వంటి లక్షణాలు కన్పిస్తాయి. ఆ లక్షణాలున్న వ్యక్తి వడదెబ్బకు గురైనట్టు గుర్తించాలి. అలాంటి సమయంలోనే ఓఆర్ఎస్ ద్రావణాన్ని సేవిస్తే, చక్కని ఉపశమనం కలుగుతుందని పెదపళ్ల, చొప్పెల్ల పీహెచ్‌సీ వైద్యాధికారులు పి.భవానీ శంకర్, డి.సువర్చలాదేవి పేర్కొన్నారు. వేసవి దృష్ట్యా అన్ని గ్రామ సచివాలయ పరిధిలోను, సబ్ సెంటర్లలోను ఓఆర్ఎస్ ద్రావణాన్ని అందుబాటులో ఉంచుతున్నామన్నారు.

అన్నిచోట్లా ఓఆర్ఎస్ లభ్యం

– డి.సాయికిషోర్, వైద్యాధికారి, పీహెచ్‌సీ, పెదపళ్ల



ఓఆర్ఎస్ అనేది వివిధ లవణాల మిశ్రమంతో కూడిన ద్రావణం. ఈ ద్రావణం 20.5 గ్రా. ప్యాకెట్ల రూపంలో అన్ని ప్రాథమిక, ప్రభుత్వ, ఏరియా ఆస్పత్రుల్లో అందుబాటులో ఉంది.

- ఈ ప్యాకెట్‌లో 2.6 గ్రా. సోడియం క్లోరైడ్, 1.5 గ్రా. పోటాషియం క్లోరైడ్, 2.9 గ్రా. సోడియం సిట్రేట్, 13.5 గ్రా. డెక్స్ట్రోజ్ ఉంటాయి.
- ఈ పౌడర్ ప్యాకెట్‌ను సురక్షితమైన లీటరు నీటిలో కలిపి, వయస్సును బట్టి తగిన మోతాదులో తాగాలి.
- సమయానికి ఓఆర్ఎస్ ప్యాకెట్ అందుబాటులో లేకపోతే, ఇంట్లోనే ఈ ద్రావణాన్ని తయారు చేయవచ్చు.
- లీటరు నీటిలో చిటికెడు ఉప్పు, చారెడు (అర స్పూన్) పంచదారను కలిపి సేవించవచ్చు.
- రెండేళ్లలోపు వారు 100 ఎం.ఎల్.లోపు ద్రావణాన్ని అర స్పూనున్ చొప్పున ప్రతి పది నిమిషాలకు ఓసారి తాగాలి.
- రెండు నుంచి పదేళ్ల వయస్సు వారు 100–200 ఎం.ఎల్. (ఒక గ్లాస్) వరకూ ఒక స్పూను చొప్పున తాగాలి.
- పదేళ్ల పైబడిన వారు 50ఎం.ఎల్. (చిన్న గ్లాస్) చొప్పున ఎండలో సంచరిస్తున్న స్థితిగతులను బట్టి తాగుతూ ఉండాలి.

అవగాహన పెంచుతున్నాం



వేసవి దృష్ట్యా ప్రజల ఆరోగ్యం కోసం వడదెబ్బ నుంచి ఉపశమనం కలిగించేందుకు అన్ని గ్రామ సచివాయల్లోను, వైద్యారోగ్య సిబ్బంది వద్ద ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచాం. ఓఆర్ఎస్ తీసుకోవడం వల్ల కలిగే ప్రయోజనాలను ఇంటింటికీ వెళ్లి వివరిస్తున్నాం.

– పి.రాధాకృష్ణ, సీహెచ్‌ఓ, పెదపళ్ల

నేడు నూకాలమ్మ జాతర



నూకాలమ్మ

మామిడికుదురు: గ్రామ దేవత నూకాలమ్మ జాతర ఆదివారం రాత్రి ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశామని ఆలయ కమిటీ శనివారం తెలిపింది. జాతర మహోత్సవం ఈ నెల 12వ తేదీ శుక్రవారం వరకు ఆరు రోజుల పాటు నిర్వహిస్తామన్నారు. జాతర మహోత్సవాన్ని పురస్కరించుకుని అమ్మవారి ఆలయాన్ని విద్యుత్ దీపాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. చలువ పందిళ్లు ఏర్పాటు చేశారు. ఆదివారం రాత్రి జాతర, సోమవారం అమ్మవారికి భక్తులు నైవేద్యాలు చెల్లిస్తారని, మంగళవారం అమ్మవారి సన్నిధిలో ఉగాది పండుగ, పంచాంగ శ్రవణం ఏర్పాటు చేశామని, బుధ, గురువారాలు పలు ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశామని, శుక్రవారం ఆలయ ప్రాంగణంలో మహా అన్న సమారాధన అనంతరం సిరిబొమ్మ తీర్థం జరుగుతుందన్నారు. జాతర ఘనంగా నిర్వహించేందుకు ఆలయ కమిటీ భారీగా ఏర్పాట్లు చేసింది.

జగన్‌ను ఆరాధిస్తున్న ప్రజలు



కొమరాడలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న వైఎస్సార్ సీపీ అభ్యర్థి గొల్లపల్లి సూర్యారావు

మామిడికుదురు: సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని ప్రజలు దేవుడిలా ఆరాధిస్తున్నారని, అతడ్ని గుండెల్లో పెట్టుకున్నారని రాజోలు అసెంబ్లీ నియోజకవర్గం వైఎస్సార్ సీపీ అభ్యర్థి గొల్లపల్లి సూర్యారావు అన్నారు. గొల్లపల్లి శనివారం కొమరాడ, ఈదరాడ, మగటపల్లి, గోగన్నమఠం గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. స్థానిక పార్టీ శ్రేణులతో సమావేశాలు నిర్వహించారు. జగన్ ఐదేళ్ల పాలన సంక్షేమానికి దిక్సూచిగా నిలిచిందన్నారు. కోవిడ్ వంటి సంక్షోభంలో కూడా సంక్షేమ పథకాలు అమలు చేసిన ఘనత జగన్‌కే దక్కిందన్నారు. మాట తప్పని, మడమ తిప్పని జగన్‌కు ప్రజలు అండగా నిలిచి మళ్లీ వైఎస్సార్ సీపీకి విజయం అందించాలని కోరారు. ప్రచారంలో బొలిశెట్టి భగవాన్, భూపతిరాజు సత్తిబాబురాజు, సాగి పీఆర్‌వీఎస్ఎస్ నర్సింహవర్మ, వలవల సత్యమూర్తి, వలవల బాబ్జి, యెరుబండి సూరిబాబు, కటకంశెట్టి ఆదిత్య, చేట్ల సత్యనారాయణ, వడ్డే ఆదిబాబు, యెరుబండి సత్యనారాయణ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

జగన్‌కు ప్రజల నీరాజనం

పి.గన్నవరం వైఎస్సార్ సీపీ అభ్యర్థి విప్పర్తి



పెదపట్నంలంకలో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న పార్టీ అభ్యర్థి విప్పర్తి వేణుగోపాలరావు

మామిడికుదురు: సంక్షేమ ప్రదాత జగన్‌కు ప్రజలు నీరాజనం పలుకుతున్నారని, ఎన్నికల ప్రచారంలో బ్రహ్మరథం పడుతున్నారని పి.గన్నవరం అసెంబ్లీ నియోజకవర్గం వైఎస్సార్ సీపీ అభ్యర్థి విప్పర్తి వేణుగోపాలరావు చెప్పారు. బి.దొడ్డవరం, పెదపట్నంలంక గ్రామాల్లో శనివారం ఆయన ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఇచ్చిన ప్రతి హామీ అమలు చేసిన నేత జగన్, ఇచ్చిన ఏ ఒక్క హామీని అమలు చేయని నేత చంద్రబాబు వీరిలో ఎవరు కావాలో ప్రజలు నిర్ణయించుకోవాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. గ్రామ సచివాలయాలు, వాలంటీర్ వ్యవస్థ, నాడు–నేడు ఇలా ఎన్నో పథకాలను ప్రవేశపెట్టి ఏపీని ఒక రోల్ మోడల్‌గా తీర్చిదిద్దిన నేత జగన్‌మోహన్‌రెడ్డి అని వేణుగోపాలరావు చెప్పారు. అన్ని వర్గాల సంక్షేమమే లక్ష్యంగా ముందుకు వెళ్తున్న జగన్‌కు ప్రతి ఒక్కరూ తోడుగా నిలవాలని కోరారు. ప్రచారంలో పార్టీ మండల శాఖ అధ్యక్షులు కొమ్ముల రాము, జెడ్పీటీసీ కశిరెడ్డి అంజిబాబు, సర్పంచ్‌లు చెల్లుబోయిన రామశివసుబ్రహ్మణ్యం, గెడ్డం మంగాలక్ష్మి, ఎంపీటీసీ జాలెం అనూష, పార్టీ నేతలు రాయుడు ఆనంద్, కేదారిశెట్టి మల్లి, జక్కంపూడి వాసు, కటకంశెట్టి ఆదిత్య, తులా గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అన్ని వర్గాల సంక్షేమం కోరే జగన్‌ను ఆశీర్వదించండి

- ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు రాపాక, చిర్ల
- దేవరపల్లిలో ఇంటింటా ప్రచారం



దేవరపల్లిలో ఇంటింటా ప్రచారం నిర్వహిస్తున్న వైఎస్సార్ సీపీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు వరప్రసాదరావు, జగ్గిరెడ్డి

రావులపాలెం: కులమతాలకు, పార్టీలకు అతీతంగా రాష్ట్రంలో అన్ని వర్గాల సంక్షేమం కోరే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ఆశీర్వదించాలని, రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని అమలాపురం పార్లమెంటు నియోజకవర్గం వైఎస్సార్ సీపీ అభ్యర్థి రాపాక వరప్రసాదరావు, కొత్తపేట వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి చిర్ల జగ్గిరెడ్డిలు కోరారు. శనివారం మండలంలోని దేవరపల్లి శివారు మట్టలదొడ్డిలో ఎన్నికల ప్రచారంలో భాగంగా వారు ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి ఒక్కరినీ ఆప్యాయంగా పలకరిస్తూ వివరాలు అడిగి తెలుసుకున్నారు. సంక్షేమ సారథి అయిన జగనన్నను మరోసారి ఆశీర్వదించాలని కోరారు. వారు మాట్లాడుతూ గత ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను 99 శాతం నెరవేర్చి మళ్లీ ప్రజల ముందుకు వస్తున్న జగన్నను ఆయన పని తీరును మళ్లీ ఈ రాష్ట్రానికి అందించాలన్నారు. టీడీపీ నేతలు చెప్పే కల్లబొల్లి మాటలు నమ్మొద్దని వారు ఇచ్చిన ఏ హామీని నెరవేర్చిన దాఖలాలు లేవన్నారు. దానికి నిదర్శనమే వారు మేనిఫెస్టో ఒకసారి చూస్తే సామాన్యులకు కూడా అర్థమవుతుందని, గత మేనిఫెస్టోల్లో వేటిని అమలు చేయకుండా మళ్లీ నేడు కల్లబొల్లి మాటలు చెప్పేందుకు వస్తున్నారన్నారు. ప్రజలు వీటిని గమనించి వారికి ఓటుతో సరైన బుద్ధి చెప్పాలని కోరారు. అలాగే ప్రతి ఒక్కరూ వారి రెండు ఓట్లను ఫ్యాన్ గుర్తుపై వేసి వైఎస్సార్ సీపీకి మరింత బలం చేకూర్చాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ కుడుపూడి శ్రీనివాసరావు, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు అప్పారి విజయ్‌కుమార్, వైస్ ఎంపీపీ గన్నవరపు వెంకట్రావు, సర్పంచులు దొమ్మేటి అర్జునరావు, కర్రి గోవిందకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జాస్‌తో కార్పొరేట్ స్థాయి సేవలు



మడికిలో ఏర్పాటు చేసిన జాస్‌లో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యాధికారులు

ఆలమూరు: అనారోగ్యంతో ఏ ఒక్కరూ ఆర్థికంగా అవస్థలు పడకుండా సంపూర్ణ ఆరోగ్యం కోసం నాణ్యమైన వైద్య సేవలు అందించాలన్న ఉద్దేశంతో జగనన్న ఆరోగ్య సురక్ష (జాస్) కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రవేశపెట్టిందని కొత్తపేట డివిజన్ వైద్యాధికారి ఎం.సుమలత అన్నారు. మండలంలోని మడికి గ్రామ సచివాలయం–1లో శనివారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ఏర్పాటు జరిగింది. చొప్పెల్ల ప్రాథమిక వైద్యాధికారులు డి.సువర్చలాదేవి, ఆర్.మల్లికార్జున్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వైద్య శిబిరంలో ప్రభుత్వ ప్రత్యేక వైద్య నిపుణులు జి.దుర్గాప్రసాద్, మేఘ స్పందన విచ్చేసి సుమారు 356 మందికి వైద్య సేవలు అందించి వివిధ రకాల రక్త నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. అలాగే కంటి వెలుగు కార్యక్రమం క్రింద నేత్ర వైద్య నిపుణురాలు పి.శ్రీలక్ష్మి 94 మందికి పరీక్షలు నిర్వహించి ఉచితంగా కళ్లజోళ్లు అందజేశారు.

దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు వైద్య సలహాలు, సూచనలు అందజేశారు. వ్యాధి తీవ్రత అధికంగా ఉన్న వారిని వైఎస్ఆర్ ఆరోగ్యశ్రీ పథకం క్రింద రాజమహేంద్రవరం ప్రైవేట్ ఆస్పత్రులకు తరలించారు. గ్రామ పంచాయతీ కార్యదర్శి కె.మోక్షాంజలి, ఎంపీహెచ్ఈఓ కె.జ్యోతికుమార్, హెచ్ఈ బి.సూర్యనారాయణ, సూపర్‌వైజర్లు పి.శివప్రసాద్, ఆర్.బాలామణి, ఆరోగ్య మిత్ర కేవీ రమణ ఆరోగ్య ఆశ సిబ్బంది పాల్గొన్నారు.

మామిడికుదురులో..

మామిడికుదురు: అప్పనపల్లి సచివాలయం వద్ద శనివారం ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం జరిగింది. నగరం పీహెచ్‌సీ వైద్యాధికారి కె.స్వర్ణలత ఆధ్వర్యంలో 363 మందికి ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. డాక్టర్లు కె.అనూష, శ్రీరామకృష్ణ నిఖిత, కేఎం హుస్సేన్ ఉచితంగా వైద్య సేవలందించారు. ప్రస్తుత వేసవి సీజన్‌లో ఎండల ప్రభావం తీవ్రంగా ఉన్న నేపథ్యంలో బాలింతలు, గర్భిణులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. సీహెచ్‌ఓ కె.సత్యవతి, పీహెచ్ఎన్ జె.నారాయణమ్మ, సూపర్‌వైజర్ బీహెచ్ సత్యనారాయణ, హెల్త్ అసిస్టెంట్ జి.యజ్ఞేశ్వరరావు, ఎంఎల్‌హెచ్‌పీలు జి.నిఖిత, సీహెచ్ లక్ష్మీదుర్గ, ఏఎన్ఎంలు జి.శ్రీదేవి, జి.సంతోషిణి, డీఈఓ సత్యనారాయణ, ఆశ కార్యకర్తలు, సచివాలయ ఉద్యోగులు, ఆరోగ్య సిబ్బంది సేవలందించారు.

కొనసాగుతున్న వలంటీర్ల మూకుమ్మడి రాజీనామాలు



ఎమ్మెల్యే జగ్గిరెడ్డిని కలసిన రాజీనామా చేసిన వెదిరేశ్వరం గ్రామ వలంటీర్లు



లొల్లలో ఎమ్మెల్యే జగ్గిరెడ్డిని కలసి మద్దతు తెలియజేస్తున్న గంటి గ్రామ వలంటీర్లు

రావులపాలెం: జగనన్నను, జగ్గిరెడ్డిని గెలిపించుకోవడమే మా ధ్యేయం అంటూ రావులపాలెం మండలం వెదిరేశ్వరంలో 40 మంది వలంటీర్లు, ఆలమూరు మండలం చింతలూరు గ్రామానికి చెందిన మొత్తం 21 మంది వలంటీర్లు అంటున్నారు. వైఎస్సార్ సీపీ కొత్తపేట నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి చిర్ల జగ్గిరెడ్డిని వారు మండలం గోపాలపురం గ్రామంలోని ఆయన స్వగృహం వద్ద శనివారం కలిశారు. జగ్గిరెడ్డి గెలుపు కోసం, జగనన్న గెలుపుకోసం కృషి చేస్తామన్నారు. ఈ సందర్భంగా వలంటీర్లు మాట్లాడుతూ పేద, బడుగు, బలహీన వర్గాల వారికి జగనన్న ప్రభుత్వంలో వలంటీర్ల ద్వారా ప్రతి పథకం ఇంటి వద్దకే అందించామన్నారు. ఉన్నత వర్గాల వారికి కూడా ప్రభుత్వ కార్యాలయాలలో ఏ విధమైన అవసరం ఉన్నా సహాయపడ్డామని, వైఎస్సార్ పింఛన్ కానుక లబ్ధిదారులకు ప్రతి నెలా ఒకటో తేదీనే ఉదయాన్నే అందించేవారమన్నారు. చంద్రబాబునాయుడు సూచనలతో ఒక సంస్థ చేసిన ఫిర్యాదు వలన నేడు వైఎస్సార్ పింఛన్ కానుక లబ్దిదారులు అవస్థలు పడుతున్నారన్నారు. ఎలక్షన్ కోడ్‌తో బెదిరించిన కూటమి నాయకులు, కార్యకర్తలు ఇప్పుడు ఏం చేస్తారు. తాము రాజీనామా చేసి ప్రజలలోకి వెళ్లి వైఎస్సార్ సీపీ నాయకులతో కలిసి చిర్ల జగ్గిరెడ్డి గెలుపునకు, జగనన్న గెలుపునకు కృషి చేస్తామన్నారు. నియోజకవర్గంలో మరింతమంది వలంటీర్లు రాజీనామాలు చేయనున్నారన్నారు. పొత్తు పార్టీలు తుడిచిపెట్టుకుపోతాయన్నారు. చిర్ల జగ్గిరెడ్డి మాట్లాడుతూ గత ఐదు సంవత్సరాలు ప్రభుత్వం తరపున ప్రజలకు సేవ చేసి, ఇప్పుడు మా గెలుపునకు కృషి చేయడానికి సిద్ధమైన వలంటీర్లకు కృతజ్ఞతలు తెలిపారు.

ఆలమూరు: సంక్షేమ సారథులుగా ప్రజల మన్ననలు అందుకుంటున్న వలంటీర్లపై ప్రతిపక్ష పార్టీలు అవలంబిస్తున్న నిరంకుశ వైఖరి, అనాలోచిత నిర్ణయాలను నిరసిస్తూ మండలంలోని పెనికేరు గ్రామ సచివాలయ పరిధిలోని 23 మంది గ్రామ వలంటీర్లు శనివారం మూకుమ్మడి రాజీనామా చేశారు. ఈసందర్భంగా ఆలమూరు మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో గ్రామ వలంటీర్లు తమ రాజీనామా పత్రాలను గ్రామ పంచాయతీ కార్యదర్శి జె.అయ్యన్నకు అందజేశారు.

కొత్తపేట: నియోజకవర్గంలో మళ్లీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ అభ్యర్థి చిర్ల జగ్గిరెడ్డి, రాష్ట్రంలో జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏర్పాటే మా ధ్యేయం అంటూ నియోజకవర్గంలో వివిధ గ్రామాల వలంటీర్లు స్పష్టం చేశారు. ఎమ్మెల్యే జగ్గిరెడ్డికి మద్దతుగా వలంటీర్లు మూకుమ్మడి రాజీనామాలు కొనసాగుతున్నాయి. దానిలో భాగంగా శనివారం కొత్తపేట మండలం గంటి గ్రామంలో 25 మంది వలంటీర్లు, ఆత్రేయపురం మండలం నార్కెడిమిల్లి గ్రామానికి చెందిన మొత్తం 18 మంది వలంటీర్లు, ఆలమూరు మండలం పెనికేరు గ్రామానికి చెందిన 23 మంది వలంటీర్లు మూకుమ్మడిగా తమ రాజీనామాలను అధికారులకు సమర్పించారు. అనంతరం వైఎస్సార్ సీపీ అభ్యర్థి జగ్గిరెడ్డిని కలసి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా చిర్ల జగ్గిరెడ్డి మాట్లాడుతూ గత ఐదేళ్ల ప్రభుత్వం తరపున ప్రజలకు సేవ చేసి, ఇప్పుడు మా గెలుపునకు కృషి చేయడానికి సిద్ధమైన వలంటీర్లకు కృతజ్ఞతలు తెలిపారు.

ఎన్నికల నియమావళి సక్రమంగా అమలు చేయాలి

ఆలమూరు: ఎన్నికల ప్రవర్తన నియమావళి (కోడ్ ఆఫ్ కాండాక్టు)ను తప్పనిసరిగా సక్రమమైన రీతిలో అమలు చేసి రాజ్యాంగాన్ని పరిరక్షించాలని కొత్తపేట డీఎల్డీవో టీఎస్‌వీ రాజేశ్వరరావు అన్నారు. ఆలమూరు మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ ఎ.మేరీరోజ్ అధ్యక్షతన గ్రామ పంచాయతీ కార్యదర్శులు, రెవెన్యూ అధికారులతో ఎన్నికల ప్రవర్తన నియమావళి–అమలులో తీసుకోవలసిన జాగ్రత్తలపై సమీక్ష జరిగింది. డీఎల్‌డీఓ రాజేశ్వరరావు మాట్లాడుతూ డివిజన్ పరిధిలో ఎక్కువగా ఆలమూరు మండలం నుంచే సీ–విజిల్‌కు ఫిర్యాదులు అందాయన్నారు. క్షేత్రస్థాయిలో గ్రామ స్థాయి అధికారులందరూ గ్రామ సచివాలయ ఉద్యోగులతో మమేకమై కోడ్ ఆఫ్ కాండాక్టు ఉల్లంఘనలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే సంబంధిత అధికారులకు తీవ్ర పరిణామాలు ఉంటాయని ఆయన హెచ్చరించారు. అనంతరం గ్రామాల వారీగా అధికారులు ఎదుర్కొంటున్న సమస్యలు, తీసుకోవలసిన చర్యలను అడిగి తెలుసుకున్నారు. తహసీల్దార్ డీవీఎస్ అనిల్‌కుమార్, సూపరింటెండెంట్ వి.రామ్ స్వరూప్ తదితరులు పాల్గొన్నారు.

అధికారులు అప్రమత్తంగా ఉండాలి



ఎస్‌టీవీ రాజేశ్వరరావు

ఆలమూరు: ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలులో ఉన్న దృష్ట్యా అధికారులు అప్రమత్తంగా ఉంటూ విధి నిర్వహణలో నిష్పక్షపాతంగా వ్యవహరించాలని కొత్తపేట డీఎల్‌డీఓ టిఎస్‌వీ రాజేశ్వరరావు అన్నారు. ఆలమూరు మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన ప్రసంగించారు. మండల స్థాయి నుంచి గ్రామ స్థాయి వరకూ ఉన్న అధికారులు సమన్వయంతో వ్యవహరించి కోడ్ ఉల్లంఘన జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఎన్నికలు ముగిసే వరకూ అధికారులు, గ్రామ సచివాలయ ఉద్యోగులు రేయింబవళ్లు అందుబాటులో ఉండాలన్నారు.

అత్యుత్సాహం ప్రదర్శించే అధికారులు గీత దాటితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. డివిజన్ పరిధిలోని ఏడు మండలాల్లో కంటే ఆలమూరు మంలడలంలోనే ఎక్కువగా 11 ఫిర్యాదులు అందాయన్నారు. గ్రామాల్లో ఏవిధమైన సమస్యలు తలెత్తినా సత్వరమే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో ఉన్నందున క్షేత్రస్థాయిలో అమలవుతున్న నిబంధనలను పరిశీలించేందుకు తహసీల్దార్ అనిల్‌కుమార్, ఎంపీడీఓ మేరీరోజ్ గ్రామ సచివాలయాలను సందర్శించాలని ఆదేశాలు జారీ చేసినట్లు డీఎల్‌డీఓ రాజేశ్వరరావు తెలిపారు.

అవినీతి రహిత పాలన బీజేపీకే సాధ్యం



కొత్తపేటలో బీజేపీ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాలూరి

కొత్తపేట: కేంద్రంలో అవినీతి రహిత పాలన బీజేపీకే సాధ్యమని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాలూరి సత్యానందం అన్నారు. శనివారం బీజేపీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఆ పార్టీ శ్రేణులు ఘనంగా జరుపుకొన్నారు. మండల పార్టీ ఉపాధ్యక్షుడు ఎ.సుధాకర్ నివాసంలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర పార్టీ నేత పాలూరి ముఖ్యఅతిథిగా పాల్గొని, పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. సత్యానందం మాట్లాడుతూ దేశ నిర్మాణం కోసం ఎందరో మహానుభావుల నిస్వార్థ త్యాగం, ఆత్మబలిదానాలతో దేశాన్ని విశ్వగురువుగా నిలపడమే లక్ష్యంగా ఏర్పడిన పార్టీ బీజేపీ అని అన్నారు. నాటి నుంచి ఎన్నో ఆటుపోట్లను తట్టుకుని నేడు ప్రపంచంలోనే అత్యధిక సభ్యత్వాలు, కార్యకర్తలు కలిగిన అతిపెద్ద పార్టీగా అవతరించిందన్నారు. కేవలం 2 సీట్లతో ప్రారంభమైన పార్టీ నరేంద్రమోదీ నాయకత్వంలో అత్యధిక మెజార్టీతో వరుసగా రెండుసార్లు ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసి, అవినీతి రహిత పాలన సాగిస్తోందన్నారు. కార్యక్రమంలో పార్టీ నియోజకవర్గ కో కన్వీనర్ కోటిపల్లి దామోదర్ జిల్లా కార్యవర్గ సభ్యుడు కోటిపల్లి సుబ్రహ్మణ్యం, పార్టీ వివిధ మోర్చాల సభ్యులు పాల్గొన్నారు.

ఖతార్ రాజు బంగారు తపాలా బిళ్ల సేకరణ



ఖతార్ దేశ రాజు ముఖ చిత్రంలో కూడిన బంగారు తపాలా బిళ్ల

అమలాపురం టౌన్: ఖతార్ దేశం రాజు తమిమ్ బిన్ హమద్ అల్ థానీ సింహాసనాన్ని అధిష్టించి పదేళ్లు పూర్తయిన సందర్భంగా ఆ రాజు ముఖ చిత్రంలో 200 రియాల్స్ ముఖ విలువతో బంగారు తపాలా బిళ్లను ముద్రించారు. అమలాపురానికి చెందిన తపాలా బిళ్లల సేకరణకర్త పుత్సా కృష్ణ కామేశ్వర్ ఈ బంగారు తపాలా బిళ్లను సేకరించారు. కేవలం వెయ్యి మాత్రమే ముద్రించిన ఈ తపాలా బిళ్లలు ఒక్కొక్కటి ఒక గ్రాము మేలిమి బంగారంతో తయారుచేశారు. అరుదైన ఈ బంగారు తపాలా బిళ్లను ఖతార్ దేశంలో తన మిత్రుడు చలంచర్ల కాశీ విశ్వనాథ్ ద్వారా సేకరించినట్లు కృష్ణ కామేశ్వర్ తెలిపారు. ఈ తపాలా బిళ్లను ప్రత్యేక టెక్నాలజీ ద్వారా నెదర్లాండ్‌లో ముద్రించారని ఆయన చెప్పారు.

బీఎస్‌ఐ జిల్లా అధ్యక్షుడిగా పరశురాం



నూతన కమిటీకి నియామక పత్రాలను అందిస్తున్న రాష్ట్ర అధ్యక్షుడు హరిబాబు

అమలాపురం రూరల్: ది బుద్ధిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా(బీఎస్ఐ) అంబేడ్కర్ కోనసీమ జిల్లా అధ్యక్షుడిగా కాశి పరశురాం నియమితులయ్యారు. బీఎస్ఐ రాష్ట్ర అధ్యక్షుడు వై.హరిబాబు అధ్యక్షతన అమలాపురంలో తిరత్న బుద్ధవిహార్‌లో శనివారం రాత్రి అంబేడ్కర్ కోనసీమ జిల్లా నూతన కమిటీని ప్రకటించారు. సెక్రటరీగా ఈవీవీ సత్యనారాయణ, కోశాధికారి దోనిపాటి ఆంజనేయులు, ఉపాధ్యక్షుడిగా పెట్టా వెంకటరావు, ఆర్గనైజింగ్ సెక్రటరీగా కె.రమేష్ నియమితులయ్యారు. వారికి నియామక పత్రాలను రాష్ట్ర అధ్యక్షుడు వై.హరిబాబు అందించారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు డీబీలోక్ నూతన కార్యవర్గాన్ని అభినందించారు.

మూడు గ్రామాల్లో ఎన్నికల ప్రచారం

పి.గన్నవరం: మండలంలోని కుందాలపల్లి, నరేంద్రపురం, రాజులపాలెం గ్రామాల్లో జనసేన, టీడీపీ, బీజేపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి గిడ్డి సత్యనారాయణ శనివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఎంపీపీ గనిశెట్టి నాగలక్ష్మి, నాయకులు నామన రాంబాబు, డొక్కా నాథ్‌బాబు, తోలేటి సత్తిబాబు, శిరిగినీడి వెంకటేశ్వరరావు, మద్దా చంటిబాబు, సాధనాల శ్రీవెంకట సత్యనారాయణ, తాటికాయల శ్రీను తదితరులు పాల్గొన్నారు.